

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం సిటీ : సెప్టెంబరు 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ ఎం.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 24 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు అన్నారు. అర్హత ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖ అధికారుల ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత ఉపవిద్యాశాఖ అధికారులకు సమర్పించాలన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. మార్గదర్శకాలు, నిర్ణీత దరఖాస్తుల నమూనాలు అన్ని మండల విద్యాశాఖ అధికారుల వద్ద లభ్యమవుతాయని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9492423420లో సంప్రదించాలని వివరించారు.

సొంతింటి కల నెరవేరేదెప్పుడు?

- అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు
- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- అమలుకాని ప్రభుత్వ హామీ



ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురం కాలనీలో అసంపూర్తి ఉన్న ఇళ్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పేదలందరికీ ఇల్లు ప్రభుత్వం లక్ష్యంగా చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం సాధ్యం కావడం లేదు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అందజేస్తున్న రూ.1.80 లక్షలు చాలటం లేదు. పెరిగిన నిర్మాణ సామగ్రి వల్ల ఇంటి నిర్మాణం ముందుకు తీసుకెళ్లాలంటే కనీసం రూ.5 లక్షల అవసరం. పేదవాడి ఇల్లు కనీస అంచనా విలువ ఇది. ప్రభుత్వం అందజేస్తున్న రూ. 1.80 లక్షలతో ఇల్లు ప్రారంభించినా, చేతిలో డబ్బు లేకపోతే పని ముందుకు సాగటం లేదు. ఇల్లు పూర్తి చేయాలంటే డబ్బులు ఉండాలి. డబ్బులు ఉన్నవారు మాత్రమే ఇల్లు పూర్తి చేయగలుగుతున్నారు. నిరుపేదలకు ఇల్లు పూర్తి చేయడం సమస్యగా మారుతుంది.

గత ప్రభుత్వం నవరత్నాలు జగనన్న ఇళ్ల కాలనీలు రెండు విధాలుగా ఇల్లు యూనిట్లు మంజూరు చేసింది. కాలనీల్లో ఇళ్ల స్థలంలో, సొంత స్థలంలో నిర్మాణాలకు యూనిట్లు మంజూరు చేశారు. ఇంటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా రూ.1.80 లక్షల అందజేసింది. ఇందులో భాగంగా సిమెంట్, ఐరన్, ఇసుక క్యాపన్లు వంటివి అందజేసింది. చాలా ఇల్లు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడం ప్రభుత్వానికి పెద్ద టాస్క్‌గా మారుతుంది. ప్రధానంగా పేదలకు ఇంటి నిర్మాణం ఆర్థిక భారంగా మారుతుంది.

జిల్లాకు గత ప్రభుత్వం ఐదేళ్లలో 796 లేఅవుట్లు వేసి 33,293 ఇళ్లు మంజూరు చేసింది. దీంతోపాటు సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్ల యూనిట్లు మంజూరు చేసింది. మొత్తం 78468 ఇళ్లు మంజూరు కాగా, 45002 ఇళ్లు పూర్తయ్యాయి. 18781 ఇళ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. 14685 ఇల్లు ప్రారంభం కాలేదు. అసంపూర్తి ఇళు పూర్తయ్యేందుకు ప్రారంభంలో టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజులు ప్రణాళిక అమలు చేసింది. మరోపక్క ఈ ఏడాది మార్చిలో అదనంగా బిసి, ఎస్‌సి, ఒసిలకు రూ.50 వేలు, ఎస్‌టి లకు రూ.75 వేలు రుణాలు అందజేసేలా చర్యలు తీసుకుంది. ఈ రుణాలు కొందరికి మాత్రమే అందాయి. దీంతో అసంపూర్తిగా ఎక్కువ ఇళ్లు దర్శనమిస్తున్నాయి. జగనన్న కాలనీలో సైతం చాలామంది లబ్ధిదారులు ప్రారంభించట్లేదు. ఇళ్లు ప్రారంభించని స్థలాలు సర్వే సైతం అధికారులు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇస్తామంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఈ హామీ మాత్రం అమలు కాలేదు. మరోపక్క అప్పటి ప్రభుత్వంలో మంజూరైన సైతం పూర్తికాలేదు. చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు పడటం వల్ల ఇళ్లు నిర్మాణాలకు ముందుకు తీసుకెళ్లలేకపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లు యూనిట్ ఖరీదు పెంచితే నిర్మాణం సాధ్యమవుతుంది. ప్రభుత్వాలు మారినా పేదవాని సొంతిల్లు కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో నిరీక్షించాల్సి ఉంది.

డబ్బులు లేక విడిచిపెట్టా



ఇంటి నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు అవుతుంది. డబ్బులు లేక ఇల్లు నిర్మాణం విడిచి పెట్టా. ఇంటి సామగ్రి పెరిగిపోయింది. రూ.ఐదు లక్షలు చేతిలో లేనిదే ఇంటి నిర్మాణం సాధ్యం కాదు. చిన్న కారు రైతులుగా జీవిస్తున్న మేము అప్పు తీసుకున్నా సకాలంలో చెల్లించలేం. ఇంటి యూనిట్ పెంచి సకాలంలో ఆర్థిక సహకారం అందించడం, లేదంటే తక్కువ రుణాలకు అప్పు ఇవ్వడం చేస్తే ఇంటి నిర్మాణం పూర్తిచేయగలం.

- బగ్గు లక్ష్మి, పొన్నాడ, ఎచ్చెర్ల మండలం

లక్ష్యాలు నిర్ధేశించుకుని ముందుకు సాగుతున్నాం

అసంపూర్తిగా ఉన్న ఇల్లు పూర్తి చేసేందుకు లక్ష్యాలు నిర్ధేశించుకుని ముందుకు సాగుతున్నాం. అసంపూర్తిగా ఉన్న ఇళ్లు పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నాం. మంజూరై నిర్మాణం చేపట్టని వారికి అవగాహన కల్పిస్తున్నాం. మంజూరైన ప్రతి ఇళ్లూ పూర్తి చేయాలన్న లక్ష్యం నిర్ధేశించుకొని ముందుకు సాగుతున్నాం.

- అప్పారావు, ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ



మాట్లాడుతున్న గోవిందరావు

కిడ్నీ వ్యాధిగ్రస్తుల బాధలు పట్టవా?

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- పలాస

ఉద్దానంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల మృత్యుఘోష ప్రభుత్వానికి పట్టదా? ఇదేనా మీరు చేసిన అభివృద్ధి అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులకు కారణాలు పరిశీలించడానికి అంతర్జాతీయ నిపుణులతో కూడిన బృందాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న 40 డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం జిఒ నంబరు 102 ద్వారా పలాసలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారని అన్నారు. కిడ్నీ ఆస్పత్రిలో 60 డాక్టర్ పోస్టులకు 40 డాక్టర్ మంది ఉన్నారని, దీనివల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 108 ద్వారా ఉచితంగా డయాలసిస్ కేంద్రానికి తీసుకువచ్చే వారిని, ఇప్పుడు ఆ సౌకర్యాన్ని ప్రభుత్వం ఎత్తు వేయడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉన్నవి తీసివేయడమేనా మీరు చేస్తున్న అభివృద్ధా? అని ప్రశ్నించారు. నెఫ్రోప్లస్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యాన నడుస్తున్న డయాలసిస్ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులో లేక నెఫ్రాలజీ డాక్టర్ లేక సరిపడే బెడ్స్ లేక కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇవి కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పట్టదా? అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి కిడ్నీ రీఛార్జ్ కేంద్రాన్ని ఎందుకు పరిశోధన కార్యక్రమాలు చేయడం లేదని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు గతంలో ఉన్న సౌకర్యాలు ఎత్తేయడంతో డయాలసిస్‌కి వచ్చేవారు రూ.1600 కిట్లు కొనుగోలు చేసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దానం గ్రామాలకు సుజలధార శుద్ధ జలాల నీరుని పైపులైన్ ద్వారా ఎప్పటికీ అనేక గ్రామాలకు అందడం లేదని అన్నారు. తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తాగునీరే అందించలేని ఈ ప్రభుత్వం అభివృద్ధి చేస్తామని ప్రగలభాలు పలుకుతుందని విమర్శించారు. పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టుల తక్షణమే భర్తీ చేయాలన్నారు. తగినంత మంది సిబ్బందిని నియమించాలని, నెఫ్రాలజిస్టులను శాశ్వత ప్రాతిపదిక పైన నిర్మించాలన్నారు. అన్ని స్పెషలిస్టు సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. డయాలసిస్ రోగులకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పింఛను అందరికీ ఇవ్వాలన్నారు. డయాలసిస్‌కు వచ్చిన రోగులతో పాటు సహాయకులు కూడా భోజన సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే కిడ్నీ వ్యాధికి సంబంధించి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అక్కుపల్లితో సహా అన్ని పిహెచ్‌సిల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లచ్చన్న పోరాటాలు భావితరాలకు తెలియాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సర్దార్ గౌతు లచ్చన్న పోరాటాలు భావితరాలకు తెలియాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా డే అండ్ నైట్ కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీలతో కలిసి శనివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వ వేడుకలుగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో స్వాతంత్ర్య సమరయోధులు స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహాత్మాగాంధీ పోరాటం ఆదర్శంగా తీసుకొని జిల్లాలోనూ అదే ఉద్యమం సాగించారన్నారు. ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న యువతకు, భావితరాలకు లచ్చన్న చేసిన త్యాగాలు గురించి తెలియజేయాలన్నారు. ఇలాంటి గొప్ప నాయకులు జిల్లాలో పట్టడం జిల్లాకే గర్వకారణమన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వతంత్ర సమరయోధుడు లచ్చన్న చిత్రపటానికి అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు పూలమాలలతో నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శేషాద్రి, సిఐ శ్రీనివాసరావు ఆర్ఐలు నరసింగరావు, శంకర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

మధ్యాహ్న భోజన పథకం జిల్లా గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి



మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు రూ.20 వేలు అమలు చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేషుబాబు డిమాండ్ చేశారు. నరసన్నపేటలో శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గౌరవ వేతనాల పేరుతో తీవ్రంగా శ్రమదోపిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత 25 ఏళ్లుగా మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, ఏడేళ్లుగా పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అతి తక్కువ గౌరవ వేతనమిస్తూ పని చేయించుకోవడం సరైనది కాదన్నారు. పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలన్నారు. పని భద్రత కల్పించాలన్నారు. రాజకీయ తొలగింపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రెండు జతల యూనిఫాం ఇవ్వాలన్నారు. ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 13,14న నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు ఎ.రాధ, ఆర్.కాంతమ్మ, నాగమణి, రత్నం, సూరమ్మ, విజయకుమారి, సరస్వతి, సుమలత, సంతోషికుమారి, జ్యోతి, నవీన, దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షం

ఆమదాలవలసలో అత్యధికంగా 30.25 మి.మీ



నరసన్నపేటలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆమదాలవలస, బూర్జ, ఎల్‌ఎన్‌పేట ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఆమదాలవలసలో అత్యధికంగా 30.25 మి.మీ వర్షపాతం నమోదైంది. బూర్జ మండలం మదనాపురంలో 25 మి.మీ, ఎల్‌ఎన్‌పేటలో 21మి.మీ వర్షం కురిసింది. ఇతర ప్రాంతాల్లో ఒక సాధారణ వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో ఎనిమిది మి.మీ, లావేరు మండలం తామాడలో 7.5 మి.మీ, రణస్థలం మండలం పైడిభీమవరంలో 6.5మి.మీ, ఇచ్ఛాపురంలో 6.25 మి.మీ వర్షం కురిసింది. జలుమూరు మండలం సైరిగాంలో 4.5 మి.మీ, గారలో 4.25 మి.మీ వర్షం పడింది. ఎచ్చెర్లలో 4 మి.మీ వర్షం కురిసింది. పలాసలో అత్యల్పంగా 0.25 మి.మీ వర్షపాతం నమోదైంది. మొత్తం మీద జిల్లాలో సగటున 7.1 మి.మీ వర్షం కురిసింది.

జిల్లాతో విడదీయరాని బంధం

విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాకు, నాకు విడదీయరాని బంధం ఉందని పూర్వ కలెక్టర్, విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయనను శనివారం ఆర్అండ్‌బి విశ్రాంత భవనంలో పలువురు ప్రముఖులు, జెసిఐ శ్రీకాకుళం సభ్యుల బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పనిచేసిన నాటి జ్ఞాపకాలు, ప్రగతికి చేసిన కృషి వివరించారు. ఆయనకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. కల్సిన వారిలో జెసిఐ వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకర్, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు, అంధవరపు సూరిబాబు, సిందూర ఆస్పత్రి ఎండీ, వైద్యులు కామేశ్వరరావు, లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ పైడి సిందూర పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఆంజనేయ స్వామిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, పథ్వీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం రెండో పట్టణ, గ్రామీణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నది పరివాహక ప్రాంతాలు, పట్టణ, గ్రామీణ చివర నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘాతో, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు నిఘా చర్యలు చేపట్టామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు పి.ఎన్.కాలనీ, బలగ, పాత్రనివలస, డెంటల్ కళాశాల పరిసరాల పరిధిలో బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ తడితర నేరాలు అద్దుకట్టు వేసేందుకు శనివారం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. పాడుబడిన బంగ్లాలు, ఇళ్లపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిరించామన్నారు. గంజాయి సేవించడం వారు పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



బంగారు కుటుంబాలకు సలహాలే సాయమట!

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పి4తో పేదలకు చేయూత నిస్తాం, వారిని పైకి తీసుకువస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు ప్రాక్టికల్‌కు ఆంతగా ఆచరణ సాధ్యం కాకపోవడంతో ప్రభుత్వం రూట్ మర్చినట్లుగా కనిపిస్తోంది. సమాజంలోని అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను మొదటి 20 శాతం సంపన్న కుటుంబాలు సాయమందించడమే దీని ప్రధాన లక్ష్యమంటూ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. బంగారు కుటుంబాలు-మార్గదర్శులు అనే నినాదంతో ప్రారంభించిన కార్యక్రమానికి తొలుత సంపన్న కుటుంబాల నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. జిల్లాలో తొలి విడతగా 69 వేల బంగారు కుటుంబాలను గుర్తించగా, వారిలో 181 బంగారు కుటుంబాలకు సాయపడేందుకు 37 మంది మార్గదర్శులు వచ్చారు. నియోజకవర్గాల వారిగా పరిశీలిస్తే పాతపట్నంలో 11,572 బంగారు కుటుంబాలు ఉన్నాయి. వారిలో 55 కుటుంబాలను ఆదుకోవడానికి ఏడుగురు వచ్చారు. ఎచ్చెర్లలో 11,024 కుటుంబాలు ఉండగా, ఐదు కుటుంబాలకు సాయం చేసేందుకు ఇద్దరు మార్గదర్శులు మాత్రమే వచ్చారు. శ్రీకాకుళంలో 10,324 కుటుంబాలు గుర్తించగా, సాయం చేసేందుకు ఒక్క కుటుంబాన్నీ ఎవరూ దత్తత తీసుకోలేదు. ఇచ్ఛాపురంలో 9,659 బంగారు కుటుంబాలు గుర్తించగా, 28 కుటుంబాలను ఆదుకునేందుకు ఆరుగురు ముందుకు వచ్చారు. టెక్కలిలో 9,541 బంగారు కుటుంబాలు గుర్తించగా, ఒక్క కుటుంబానికీ సాయపడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆమదాలవలసలో 9,023 కుటుంబాలను గుర్తించగా, రెండు కుటుంబాలను ఆదుకోవడానికి ఇద్దరు మార్గదర్శులు వచ్చారు. నరసన్నపేటలో 7,745 బంగారు కుటుంబాలను గుర్తించగా, నాలుగు కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు నలుగురు వచ్చారు. పలాసలో 6,678 కుటుంబాలను గుర్తించగా, వారిలో మూడు కుటుంబాలకు చేదోడుగా ఉండేందుకు ముగ్గురు మార్గదర్శులు వచ్చారు.

మార్గదర్శులు ముందుకు రాకపోవడానికి అసలు కారణం వేరేగా ఉన్నట్లు వినికిడి. డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందనే ఉద్దేశంతోనే వారు ముందుకు రాలేదని తెలిసింది. పి4తో పేదల ఉద్ధరణ అంశం అభాసుపాలువుతుందని గ్రహించిన ప్రభుత్వం దానిని పూర్తిగా సడలించింది. డబ్బులే ఇవ్వనవసరం లేదు, మార్గదర్శులు తమ నైపుణ్యాన్ని, వారి జ్ఞానాన్ని అందించినా అది సాయమే అని చెప్పడంతో అమాంతంగా వారి సంఖ్య పెరిగింది. వంద లోపు ఉండే మార్గదర్శుల సంఖ్య ఏకంగా 10,600కు చేరింది. వారు 61 వేల కుటుంబాలను దత్తత తీసుకున్నట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. మార్గదర్శుల సంఖ్య అనూహ్యంగా పెరగటానికి అనేక కారణాలు ఉన్నాయి. పి4 అమలు తీరుపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వేగవంతానికి దిశానిర్దేశం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు అన్ని ప్రభుత్వశాఖలకు పి4 లక్ష్యాలను విధించారు. ఉదాహరణకు పౌర సరఫరాల శాఖ అయితే వారి పరిధిలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల్లో పనులు కల్పించే విధంగా వారు డీలర్లకు సూచించారు. ఆ విధంగా ఒక్క నెలల వ్యవధిలోనే 37 మంది మార్గదర్శుల నుంచి 10,600 మార్గదర్శులకు పెరిగిపోయింది.

దత్తతకు నోచుకోకుండా జిల్లాలో సుమారు మరో 8 వేల కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తోంది. తమకు ఎవరు సాయం అందిస్తారా? అని వారంతా ఎదురుచూస్తున్నారు. వివిధ తరగతులకు చెందిన వారు దత్తత తీసుకున్నా వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలెవరూ ఇందులో భాగస్వామ్యం ప్రస్తుతం ఆదుకునేందుకు ముందుకొచ్చిన మార్గదర్శులు కూడా సమాజంలో మొదటి 20 శాతంగా ఉన్న అత్యంత సంపన్నులేమి కాదు. మానవతా దృక్పథం, పేదలను ఆదుకోవాలన్న సంకల్పంతో వారు ముందుకు వచ్చారు. తరతరాలుగా అనుభవించినా తరగని సంపద, వందల కోట్ల టర్నోవర్‌తో పరిశ్రమలను నడిపిస్తున్న వ్యాపారులు, వందలాది ఎకరాల భూములు అనుభవిస్తున్న పెద్దలు, కోట్ల రూపాయలను ఆదాయ పన్నుగా చెల్లిస్తున్న సంపన్నులు ఇలా చెప్పుకుంటూ వెళ్తే ధనవంతుల జాబితా చాంతాడులా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు చెప్తే వీరిలో ఎవరూ కాదనరు. కానీ మంత్రి అచ్చెన్నాయుడుతో సహా ఎమ్మెల్యేలెవరూ చొరవ చూపకపోవడతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం నీరుగారుతోంది. ప్రజాప్రతినిధుల్లో కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కాస్తా నయమనిపించారు. పది మంది నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహా ఇతర ఎమ్మెల్యేలు ఎవరూ కుటుంబాలకు సాయం చేసేందుకు ముందుకు రాకపోవడంపై ప్రజల్లో చర్చ నడుస్తోంది. ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. తాము ఫలానా కుటుంబాలను ఆదుకుంటామని వారు ప్రకటిస్తే ఇతర సంపన్న కుటుంబాలూ ముందుకొచ్చే అవకాశం ఉంది. తమ సాయం అందించే చేతుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అంతా కోరుతున్నారు.



అదీప్‌రాజును సన్మానిస్తున్న కృష్ణచైతన్య

కృష్ణదాస్‌ను కలిసిన అదీప్‌రాజు

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌ను ఉత్తరాంధ్ర జోనల్ యువజన విభాగం వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాంధ్రలో యువజన మరింత పటిష్టం చేయాలని సూచించారు. పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం అదీప్‌రాజును దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్, జిల్లా యూత్ అధ్యక్షులు మార్పు పృధ్వీ, రాష్ట్ర యూత్ కార్యదర్శి చింతు రాఘవ, చక్రవర్తి, జిల్లా యూత్ కార్యదర్శి పాగోటి గోవింద పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సిఎం సహాయనిధి పేదలకు వరం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

సిఎం సహాయనిధి పేదలపాలిట వరం లాంటిదని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జి.సిగడాంకు చెందిన కోన రంగారావు కుటుంబానికి సిఎం సహాయనిధి కింద వచ్చిన సుమారు రూ.75090 విలువైన చెక్కును శనివారం క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, ముప్పిడి సురేష్, లంక శ్యామలరావు, జి.సిగడాం సర్పంచ్ ముద్దాడ గౌరి, పిఎసిఎస్ చైర్మన్ బెవర జగన్, లావేరు పిఎసిఎస్ చైర్మన్ దామోదరావు, డైరెక్టర్లు పుణ్యపు శంకర్, దన్నాన రవింద్ర, మీసాల గిరిబాబు, పడాల అప్పన్న మాస్టర్, విక్రమ్ కామేశ్వరరావు, గోవిందరావు, సూరె రెడ్డి, సందీప్ తదితరులున్నారు.



సన్మానిస్తున్న సభ్యులు

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జెసిఐ ఇచ్చాపురం ఆధ్వర్యాన 'సెల్యూట్ ది సైలెంట్ స్టార్స్' కార్యక్రమాన్ని టౌన్, రూరల్ పోలీసులు శనివారం నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి పి.రంజిత్, ఎం.అప్పారావు, బి.అనూష, సురేష్, రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బి.మోహిని, పి.శంకర్‌రెడ్డి, వై.తిరుపతిరావు, మైత్రి పోలీస్ ఎం.సోమేష్‌లకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమోంటోలు అందజేశారు. జెసిఐ అధ్యక్షులు కాళ్ల జైదేవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐలు ముకుందరావు, శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ మోహన్, వెంకటేష్, జోన్ ఆఫీసర్లు షణ్ముఖ్, స్వరూప్తో, వెచ్చ రాము, దిల్లేష్, సంతోష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు బాల సాహిత్య పురస్కారం

పలాస : విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో కృష్ణాష్టమి, ఉభయ తెలుగు రాష్ట్రాల మాసపత్రిక బాలబాట 18వ వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా పలాసకు చెందిన సీనియర్ రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి బాల సాహిత్య పురస్కారం లభించింది. ఆయనను విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఎపి సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, అనిల్‌కుమార్, రచయిత కొలచిన రామ జగన్నాథ్, కొల్లూరు స్వరాజ్య, వెంకట రమణమ్మలు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కృష్ణమూర్తికి పలు సాహితీమిత్రులు అభినందనలు తెలిపారు.

రేపు రైతు సమస్యలపై ర్యాలీ

టెక్కలి రూరల్ : రైతులకు ఎరువులు, సాగునీరు అందజేయాలని ఈ నెల 18న టెక్కలి అంబేద్కర్ కూడలి నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆర్‌డిఒకు రైతు సమస్యలపై వినతిపత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లచ్చన్న సేవలు వెలకట్టలేనివి



శ్రీకాకుళం సిటీ: లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కొత్తూరు

సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ పేరుతో సార్థకం చేసుకున్న ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని లచ్చన్న 116వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతటి మహోన్నత వ్యక్తి మన జిల్లా వాసుడు కావడం గర్వకారణ మన్నారు. కార్యక్రమంలో కర్లెమ్మ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ దాస్‌నాయుడు, ఎద్దు శ్రీనునాయుడు, మడపాన రాజారావు, కాదూరి వాసు, చోడవరపు ఉపేంద్ర, ఎద్దు జగదీష్ పాల్గొన్నారు.

కవిటి: దేశ స్వాతంత్ర్య పోరాటం, అణగారిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన సేవలు వెలకట్టలేనివని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 ఏళ్లకే పలాసలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న లచ్చన్నను బ్రిటిష్ దొరలు అరెస్టు చేసి జైలులో పెట్టారని గుర్తు చేశారు. అనంతరం క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొని, బ్రిటిష్ దొరలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. రైతుల కోసం, ఓటు హక్కు లేని ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయం లచ్చన్న చిత్రపటానికి తహశీల్దార్ బడే పాపారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిటి రాము, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నరసన్నపేట : నరసన్నపేటలో లచ్చన్న చిత్రపటానికి శ్రీశయన సంఘం ప్రతినిధి టి.వి.చంద్రమోహన్‌దేవ్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దంత శ్రీనివాసరావు, బొంతల సింహాచలం, వంకతాటి దాలిరాజు, దండుబాటి రాధాకృష్ణ, డొంకాన మణికంఠ, కోల సింహాచలం పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాటీ కార్యాలయంలో లచ్చన్న చిత్రపటానికి ఎపిటిపిసి చైర్మన్ వజ్జ. బాబూరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్, గాలి కృష్ణారావు, రవి శంకర్ గుప్త పాల్గొన్నారు. అలాగే కిష్టువురంలో నిర్వహించిన లచ్చన్న జయంతి వేడుకలలో కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, బూరెల రాజు, వడ్డి యాదగిరి పాల్గొ న్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కె.వసంత కుమార్ ఆధ్వర్యాన లచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించారు.

సోంపేట : పట్టణ శివార్‌లోని లచ్చన్న ఘాటు వద్ద ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ నివాళ్లర్పించారు. లచ్చన్న జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. అలాగే పలాసపురంలో



సోంపేట : ఉపకార వేతనాలు అందజేస్తున్న సంఘ సభ్యులు

జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు ఆధ్వర్యాన లచ్చన్న జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దలు దేవాడ దుర్యోధన, దుద్ది భారతి, కోదండరావ్, కేశవరావు, రాజారావు, గంగారావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

లచ్చన్న జయంతి సందర్భంగా వైద్యులు డాక్టర్ తుంగాన వెంకటేశం సోంపేట టౌన్‌లోని జిల్లా శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యాన పదో తరగతి విద్యార్థుల ఉపకార వేతనాలు అందజేశారు. 500కు పైగా మార్కులు సాధించిన సుమారు 50 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలతో పాటు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆనింగి రాజు, కోశాధికారి దానయ్య, రాజ సలహాదారు తాతయ్య, సోంపేట టౌన్ శ్రీశయన ప్రెసిడెంట్ రెల్ల నారాయణ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు బాంధవుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్నను బడుగులు ఆరాధ్య దైవంగా భావిస్తారని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు కొమ్ము రమణమూర్తి కొనియాడారు. స్థానిక గాంధీ స్మృతివనంలోని సర్దార్ లచ్చన్న 116వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పన్నాల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



రెల్లివీధిలోకి చేరిన వరద నీరు

వీధుల్లోకి వరదనీరు

కొత్తూరు : మండల కేంద్రంలోని రెల్లివీధి, ప్రధాన రోడ్డుపై హడ్డుబంగి సాగునీటి కాలువ వరదనీరు శనివారం చేరింది. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సాగునీటి కాలువలో స్థానికులు చెత్తా చెదారం పడవేయడంతో పూడిక పేరుకుపోయాయి. దీంతో చిన్న వర్షానికే కాలువలోని నీరు రోడ్డుపై, వీధుల్లోకి చేరుతుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరిస్తారని స్థానికులు కోరుచున్నారు.

ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని రాగోలు పంచాయతీ రాయపాడులో శీర రమణయ్య భార్య ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలోని ఇల్లీసిపురంలో ఇటీవల శిర్ల రామారావు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయనతో పాటు చిట్టి జనార్దనరావు, గేదెల పురుషోత్తమరావు తదితరులున్నారు.

తిలక్...

సంతబొమ్మాళి : మండలంలోని లక్కివలస పంచాయతీ సర్పంచ్ శ్రీరంగం వీరాస్వామి కుటుంబానికి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు శనివారం పరామర్శించారు. ఇటీవల వీరాస్వామి తల్లి మృతి చెందడంతో మండలంలోని పలువురు వైసిపి నాయకులతో కలిసి వెళ్లి వారి సంతాపం తెలియజేశారు. వైసిపి నాయ కులు మెరుగు అప్పారావు, మార్పు నాగభూషణరావు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ తెరిచిన ప్రైవేటు పాఠశాలలు

రణస్థలం: ప్రభుత్వ సెలవుల్లో కూడా ప్రయివేటు పాఠశాలలు తెరుస్తున్నారని అధికారులు పట్టించుకోవడం లేదని ఎపియుఎస్ రణస్థలం మండల అధ్యక్షులు జి.చిన్నకృష్ణ నాయుడు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ కృష్ణాష్టమి ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవు దినం అయినప్పటికీ మండలంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలలు నిర్వహించారన్నారు. పిల్లలకు చిన్నతనంలోనే పండగలు, సంస్కృతి, సాంప్రదాయాలు తెలియాల్సి ఉందన్నారు. సాధారణ సెలవు దినాల్లో పాఠశాల నడుపుతున్న ప్రయివేటు పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇది కొనసాగితే విద్యాశాఖ అధికారులపై కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు.

పాఠశాలకు రూ.40 వేలు వితరణ

కోటబొమ్మాళి : మండలంలోని పొడుగుపాడు ప్రభుత్వం పాఠశాలకు శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక శైలజ, సత్యరాజు శనివారం రూ. 40వేలు చెక్కులు ఉపాధ్యాయులకు అందజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ మొత్తాన్ని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎండ భాస్కరరావు, సింగూరు వాసు, కళ్యాణి, అన్నెపు భాస్కరరావు, ఎండ నారాయణ, తిర్లంగి చిన్నప్పుడు, గుంట సోమేశ్వరరావు, సూజాత పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న శేషగిరిరావు

కాలువ పనులకు శంకుస్థాపన

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ మండ పోలం కాలనీ వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న పాతజాతీయ రహదారి డ్రైనేజీ పనులకు టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో నియోజకవర్గంలోని అన్నీ రంగాలనూ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు కోళ్ల లవకుమార్, కోళ్ల కామేష్, దల్లి ప్రసాద్‌దొడ్డి, ప్రఫుల్ల పరిడ, జీరు వెంకటరెడ్డి, కోరాడ రాంప్రసాద్, పట్టమోహన్, కొనారి శంకర్, అప్పారావు, మధు పాల్గొన్నారు.

రేపు సదరం ధ్రువపత్రాల పరిశీలన

టెక్కలి రూరల్ : ఈ నెల 18న ఆర్‌డిఒ కార్యాలయంలో వికలాంగుల సదరం ధ్రువపత్రాల రీ వేరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు వికలాంగుల జిల్లా అధ్యక్షులు ఆవుల వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లోని సచివాలయం ద్వారా నోటీసులు జారీ చేసిన వికలాంగులు హాజరు కావాలన్నారు. తమ ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం తీసుకురావాలన్నారు.



క్రీడా దుస్తులతో విద్యార్థులు

క్రీడా దుస్తుల పంపిణీ

పొందూరు: మండలంలోని రాపాక కూడలిలో గల మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శనగల గంగరాజు క్రీడా దుస్తులను అందజేశారు. గురుకుల పాఠశాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులకు రూ.10 వేలు విలువ గల కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి క్రీడా దుస్తులను ఆయన అందజేశారు. విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బొత్స ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హర్షవల్లి లయన్స్ సేవలకు అవార్డు

శ్రీకాకుళం సిటీ: హర్షవల్లి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ హారికా ప్రసాద్, ప్రస్తుత అధ్యక్షుడు లయన్ డాక్టర్ సత్య స్వరూప్, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా చైర్మన్‌లు వావిలపల్లి జగన్నాథం నాయుడు, కరణం శోభారాణి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం అవార్డు స్వీరించారు. వరుసగా రెండుసార్లు అవార్డు స్వీకరి ంచినట్లు చెప్పారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తరిస్తామన్నారు.



అవార్డు స్వీరిస్తున్న హర్షవల్లి లైన్స్ క్లబ్ ప్రతినిధులు

'సైనిక సేవల' రచనలకు గుర్తింపు

ప్రజాశక్తి- రణస్థలం

సాహిత్యం, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న వర్ధమాన రచయిత్రి, మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీకి రెండోసారి ప్రతిష్ఠాత్మక విశ్వభారత్ వీర పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 15న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం ఆమెకు అందజేశారు. ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, సినీనటి జయలలిత, విశ్వభారత్ చైర్మన్ బలివాడ రమేష్‌లు ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశభక్తి, సైనికుల త్యాగాలపై ఆమె రాసిన కథనాలు, సమాజ సేవా కార్యక్రమాల్లో చూపిన అంకితభావం చూసి ఈ అవార్డుకు ఎంపిక చేశామని వారు తెలిపారు. ఆమె సాహిత్యం ద్వారా సైనికుల సేవా భావాన్ని రచనల ద్వారా అందించడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం ప్రశంసనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మోజీ మాట్లాడుతూ



విశ్వభారత్ వీర పురస్కారం అందుకుంటున్న అమ్మోజీ

రెండోసారి వరుసగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవడం తనకు గౌరవంగా భావిస్తున్నానన్నారు. భవిష్యత్‌లో వీలైనంత వరకు సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కథనాలు రాయడం, సేవ కార్యక్రమాల్లో పాల్గొనడడం చేస్తానన్నారు. టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన అమ్మోజీ ప్రస్తుతం రణస్థలం మండలంలోని సంచాం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

టిడిపి అనుబంధ కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదేశాల మేరకు టిడిపి మండల అనుబంధ కమిటీలను శనివారం ఏర్పాటు చేశారు. తెలుగు యువత అధ్యక్షునిగా బోర యువరాజు, ఉపాధ్యక్షునిగా తిప్పన చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పైల హరీష్, కోశాధికారిగా నల్ల అనిల్ సాహు, కార్యనిర్వాహక కార్యదర్సులుగా, దక్కత అశోక్‌కుమార్ రెడ్డి, ఏదురు మోహన్, సరద్ ప్రదాన్, కార్యదర్శులుగా దున్న రమేష్, దక్కత వాసులను ఎన్నికయ్యారు. తెలుగు మహిళా అధ్యక్షునిగా కూన అన్నపూర్ణ, ఉపాధ్యక్షునిగా దక్కత నాగమ్మ, ప్రధాన కార్యదర్శిగా అంబటి ఆరుద్ర, తెలుగు రైతు అధ్యక్షునిగా పిట్ట దివాకర్, ఉ పాధ్యక్షునిగా బోర వాసు, ప్రధాన కార్యదర్శిగా దున్న జోగారావు, బిసి సెల్ అధ్యక్షునిగా కోట రామారావు, ఉపాధ్యక్షునిగా దుక్క భీమారావు, ప్రధాన కార్యదర్శి సిరపు జోగారావు, ఐటిడిపి అధ్యక్షునిగా కండ్రేడ్ల నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షునిగా అంబటి రాజారావురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిప్పన బాల, ఎస్‌సి, మైనారిటీ సెల్, కళాకారులు విభాగం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, టిడిపి మండల సెక్రటరీ దక్కత కామేశ్వరావు, మాజీ ఎంపిపి ఢిల్లీరావు, దక్కత శ్రీను, సహదేవ, ఎం.సూర్యనారాయణ, డి.సూర్యనారాయణ, దుర్యోదన, కాళ్ల గోపీప్రకాష్, చంద్ర నాయక్, లోహిదాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి ఉత్తర

మహాసభలను విజయవంతం చేయాలి

రణస్థలం: సెప్టెంబర్ 13, 14 తేదీల్లో అనంతపురంలో జరగనున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర అన్నారు. శనివారం రణస్థలం హైస్కూల్ ఆవరణలో జరిగిన మండల సమావేశంలో పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తర మాట్లాడుతూ సెప్టంబర్‌లో జరుగు మధ్యాహ్న భోజన పథకం జిల్లా మహాసభలు, రాష్ట్ర, మహాసభల్లో పలు డిమాండ్లపై చర్చించి భవిష్యత్ పోరాటాలు రూపొందిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేయాలని, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంటకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలని రాజకీయ జోక్యం, అక్రమ తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీసభ్యులు ఎ.రాము, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావద్దు

ఆమదాలవలస: యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు తాళాబత్తుల ధనుంజయరావు అన్నారు. శనివారం మాదకద్రవ్యాల నిషేధంపై రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి వన్వే జంక్షన్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

శభాష్ మేఘన

ప్రజాశక్తి- కవిటి

సాధారణ దిగువశ్రేణి మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి అకుంఠిత దీక్షతో భారత నావికాదళంలో ఉద్యోగం సాధించిన పొల్లాయి మేఘన నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు, కపాసుకుద్ది మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు కొనియాడారు. భారత నావికాదళంలో ఇటీవల ఉద్యోగంలో చేరిన మేఘన ఒడిశా రాష్ట్రం చిలక నావెల్ బేస్‌లో ట్రైనింగ్ పూర్తిచేసి అక్కడ నిర్వహించిన పరీక్షల్లో 5వ ర్యాంకు సాధించింది. దీంతో కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో ఏవియేషన్ విభాగంలో త్వరలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టనుంది. ఈ



అభినందిస్తున్న శ్రీరాములు తదితరులు

సందర్భంగా శనివారం స్వగ్రామం చేరుకున్న మేఘనకు గ్రామస్తులు రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పి.చంద్రశేఖర్, పి.హేమారావు, ఎస్.లక్ష్మణరావు, పి.వెంకటరావు, ఆర్.లోకనాథం పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కోటబొమ్మాళి : మండ లంలోని ఊడికలపాడు రామమందిరంలో శనివారం ఆలయ ధర్మకర్త సనపల కరుణ్ కుమార్ ఆధ్వర్యాన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహి ంచారు. మండల కేంద్రం వెంకన్న్ రోడ్డు యువత కృష్ణాష్టమి సందర్భంగా ఊట్టిని కట్టి ఉల్లాసంగా గడిపారు. స్థానిక వంశధార పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికుల వేషదారణలో అందరినీ అలరించారు.



కవిటి : ఆకట్టుకున్న వేషధారణలు

కవిటి: స్థానిక భారతీయ విద్యాకేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణులు, వసుదేవుడు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సభలో కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు మాట్లాడుతూ కృష్ణుడి బాల్యక్రీడలు, ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సిన విలువలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అనిల్, ఉపాధ్యాయులు శిరీష, కృష్ణకుమార్, సుహాసిని, జ్యోతి, అంజలి, లక్ష్మి, ఝాన్సీ, రాజేశ్వరి, సరిత, ఢిల్లీరావు, ధర్మారావు, మాదికమ్మా పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని గొదాలంలో కృష్ణాష్టమి నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసానంద సరస్వతి, ఎస్.కరుణ కుమార్‌స్వామి, గురు స్వామి, డి.రమణారావు రెడ్డి, గొలివి మోహన్, ఎం.రమణ, ఎం.రామారావు, తులసీరావు పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో నటరాజ నాట్య అకాడమీ ఆధ్వర్యాన కృష్ణాష్టమి వేడులకు పత్రి శ్రీకాంత్ ఆధ్వర్యాన నిర్వహించారు. విద్యార్థుల వేష ధారణ పోటీలు, నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టుట, కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. నటరాజ నాట్య మండలి, వ్యవ స్థాపకులు డాన్స్ మాస్టర్, బింధు కామేశ్వరి మాట్లాడారు.



కోటబొమ్మాళి : కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు

రామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యాన కృష్ణాష్టమి సందర్భంగా మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లాంక్స్, రాత సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఉప్పాడ పాండురంగారావు, పూర్వ అధ్యక్షులు వాసుదేవరావు, సెక్రటరీ గోరు శ్రీనివాబాబు, సూపర్‌వైజర్ మంగపతి, సీనియర్ సభ్యులు గోపీ పాల్గొన్నారు.

జీడి కార్మికులు సంపాదించుకున్న వారాంతపు వేతనంలో కొంత భాగం పొందుపు చేసుకున్నారు. ఈ మొత్తం రూ.54 వేలు కృష్ణామి వేడుకలు సందర్భంగా రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్ ఉన్న గోకులం గోవుల దాణాకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రామేశ్వంరావు, జీడి పరిశ్రమ యజామని తాళాసు శ్రీనివాస్, కార్మికులు బాల, పార్వతమ్మ, ఢిల్లీ పాల్గొన్నారు.



పలాస : వేషధారణలో చిన్నారులు

నరసన్నపేట: విశ్వభారతి స్కూల్‌లో డైరెక్టర్ వేణు ఆధ్వర్యాన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణ, గోపికల వేష ధారణలో నృత్యాలు చేశారు.

కుక్కలతో జరభద్రం

- రోడ్లపై గుంపులుగా సంచారం
- భయాందోళనలో మండల వాసులు



మండల కేంద్రంలో సంచరిస్తున్న వీధికుక్కలు

ప్రజాశక్తి- రణస్థలం

కుక్క పేరు చెబితే విశ్వాసానికి ప్రతీక అని అంటారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతుంది. వీధికుక్కల బెడద భరించలేనంతగా పెరిగిపోతోంది. నిత్యం ఏదో ఒక ఊరిలో,ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతూనే ఉన్నారు. పిల్లలు, పెద్దలు, ఆడ, మగ అని తేడా లేకుండా కనిపించిన వారిని కనిపించిన చోట వీధికుక్కలు వెంటాడుతూనే ఉన్నాయి. కరుస్తూనే ఉన్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తర్వాత పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వీధి కుక్కలను చూస్తేనే జనం భయపడిపోతున్నారు. కొన్ని వీధుల్లో అయితే ఇళ్లలో నుంచి అడుగు తీసి బయట పెట్టాలంటే చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వణికిపోతున్నారు. ఏవీధిలో చూసినా సుమారు పాతికకు తక్కువ కాకుండా శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. కరిచి పిక్కలు పీకే దాకా ఊరుకోవడం లేదు. పట్టిన పట్టు విడవకుండా ఎంత మంది బెదిరించినా బెదరకుండా ఎగబడి మరీ కరిసిన దాఖలాలున్నాయి. రాత్రిపూట ద్విచక్ర వాహనదారులను పరుగులు పెట్టిస్తున్నాయి. అలాగే పెంపుడు కోళ్లను వెంటాడి వెంటాడి మరి పట్టుకుని పీక్కుతింటున్నాయి. మహిళలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చేపల మార్కెట్, మాంసాహార దుఖాణాల వద్ద ఎక్కువగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. పంచాయతీ అధికారులు కుక్కల బారినుంచి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలోని మూడు కెజిబివిల ప్రిన్సిపాళ్లతో గ్రూప్‌కాల్ మాట్లాడారని, ఆ సమావేశానికి పూర్తి సమాచారంతో సౌమ్య రాకపోవడంతో ఎమ్మెల్యే ప్రశ్నించడంతో ఎదురు దాడికి దిగి దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన సౌమ్యపై త్వరలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. వీరితో పాటు పట్టణ తెలుగు మహిళా అధ్యక్షులు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్లు రెడ్డి గౌరీ, గుడ్ల రాజ్యలక్ష్మి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, తోట రాము, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గీత

ఆధారాలు లేని ఆరోపణలు చేయడం కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్యకు సబబుకాదని టిడిపి మండల మహిళా అధ్యక్షులు అనకాపల్లి విజయలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు పైడి ఆరుణ కుమారి, ఎంపిటిసి-4 బాడాన హారిక అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలంటే ఎమ్మెల్యేకు ఎంతో గౌరవమని, మహిళలను ఏనాడు చులకన భావనతో చూడలేదన్నారు. గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అసత్యమైన మాటలు ఆడకూడదని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపిటిసి పి.లక్ష్మి, జి.హేమలత తదితరులు పాల్గొన్నారు.